

జంక్షన్‌లో మర్రిచెట్టు
Bali

# పొగబండి కథలు



- ఓలేటి శ్రీనివాసభాను



కరెంట్ పోయింది. ఏసి ఆగిపోయింది. దాంతో ఆ జంక్షన్ స్టేషన్‌లోని ఆఫీసర్స్ రెస్ట్ హౌస్ కుతకుతలాడిపోయింది. వేసవి రాత్రి రెస్ట్‌హౌస్‌లోని కుషన్ బెడ్ మీద ఆఫీసర్ కిశోర్ కుమార్‌కి చాలా ఇబ్బందిగా అనిపించింది. కిశోర్‌కుమార్ ఆ రోజు ఉదయం జంక్షన్ స్టేషన్‌ని తనిఖీ చెయ్యాలని వచ్చాడు. స్టేషన్ బిల్డింగ్, క్యాబిన్లు, గూడ్స్‌షెడ్, మార్షలింక్ యార్డ్– ఇలా ప్రతీ విభాగాన్నీ విడిచిపెట్టకుండా తనిఖీ చేశాడు. తరచి తరచి చూశాడు. తప్పులు పొగబెట్టిన కలుగులోంచి ఎలకల్లాగా బయటపడ్డాయి. కిశోర్ కుమార్ మండిపడ్డాడు. ముగ్గుర్ని సస్పెండ్ చేశాడు. నలుగుర్ని 'ఆన్ ది స్పాట్' ట్రాన్స్‌ఫర్ చేశాడు. మొహం చూపించొద్దంటూ స్టేషన్ సూపరిండెండెంట్ మీద కేకేలేశాడు. పొద్దు పోయాక ఆఫీసర్స్ రెస్ట్‌హౌస్‌లోని షవర్ బాత్ కింద చాలా సేపు ఉండిపోయాడు. అలసట తీరలేదు. మనిషి చల్లారలేదు. అలాంటి పరిస్థితిలో కరెంట్ పోయింది.

చీకట్లో కిశోర్‌కుమార్ తన గదిని ఆనుకొని వున్న వెనుక వైపు వరండాలోకి వచ్చాడు. అక్కడ ఫ్రెంచ్ విండోలోంచి రైల్వే కాంపౌండ్ వాల్ కనిపిస్తోంది. దానికి అటువైపు మున్సిపాలిటీ ఖాళీ జాగా. దాని మధ్యలో ఊడలు దిగిన మర్రిచెట్టు.

కిశోర్‌కుమార్ మర్రిచెట్టు వైపు చూస్తూ సిగరెట్ వెలిగించాడు.

సేదతీరాలని ప్రయత్నించాడు.

వీలు కాలేదు. విసుగొచ్చింది.

'రిలాక్సింగ్ టెక్నిక్స్' గురించి చదివిన పుస్తకాలూ, విన్న ఉపన్యాసాలూ పనిచెయ్యలేదు. కిశోర్ కుమార్ చేస్తున్న ఆఫీసర్ ఉద్యోగం అలాంటిది. సీనియర్ డివిజనల్ ఆపరేటింగ్ సూపరిండెంట్. అంటే సమస్యలతో సవాళ్లతో సహస్రావధానం చెయ్యడమే. ఏ నిర్ణయాన్నీ వాయిదా వేయడానికి వీల్లేదు. పాదరసంలాగా చురుగ్గా ఆలోచించాలి. క్షణంలో తీసుకొన్న నిర్ణయమైనా గురి తప్పకుండా వుండాలి.

ఉదయం నుంచి రాత్రి వరకు... రాత్రి మళ్లీ తెల్లారే వరకూ..

వ్యాగన్లతో కిక్కిరిసిన మార్షలింగ్ యార్డ్‌లాగా అనుక్షణం వత్తిడి. పదిమందినీ అదిలిస్తూ.. జీవితంలోని సున్నితమైన ఆలోచనలు మొద్దుబారి, మోటుదేరి యాంత్రికంగా బతకాల్సిందేనా?

కిశోర్ కుమార్ తాత్త్వికతలో పడ్డాడు. సిగరెట్ అయిపోయింది. మరో సిగరెట్ వెలిగించేలోగా....

కాంపౌండ్ వాల్ అవతల మర్రిచెట్టు కింద నుంచే కాబోలు, పచ్చికట్టెలు కాలుతున్నట్లుంది. పొగ వస్తోంది. దాంతో పాటు జొన్న రొట్టెలు కాలుతున్న కమ్మని వాసన.

ఆ వాసనంటే కిశోర్‌కుమార్‌కి చాలా ఇష్టం. ఆయన తండ్రి మిలట్రీలో పెద్ద ఆఫీసర్‌గా పనిచేసి రిటైర్ అయ్యారు. ఆ రోజుల్లో వాళ్లింట్లో ఓ వంట మనిషి వుండేవాడు. అతను తమ కోసం ఖరీదైన వంటలు చేసినా, సర్వెంట్ క్వార్టర్స్‌లోని తన ఇంట్లో జొన్న రొట్టె చేసుకునేవాడు. కిశోర్‌కుమార్‌కి డైనింగ్ టేబుల్ మీద డెకరేట్ చేసిన డిష్‌ల కన్నా వంట మనిషి ఇంట్లోని జొన్న రొట్టి రుచిగా వుండేది. తమ హోదా ప్రకారం, పనివాళ్ల ఇళ్లకి వెళ్ల కూడదు. వాళ్లిచ్చినవి తినకూడదని మామ్ వారించేది. కానీ కిశోర్ కుమార్ ఆవిడకి తెలీకుండా వెళ్లేవాడు. ఆవురావురుమంటూ జొన్న రొట్టెలు తినేవాడు. అవన్నీ బాల్య స్మృతులు. బాగా గడిపిన రోజులు.

జొన్న రొట్టెల వాసన తరగలు తరగలుగా తేలి వస్తోంది.

కాస్పేపటి తరువాత మువ్వల చప్పుడులు, వేణునాదం, డోలక్ దరువులూ వినిపించాయి. కిశోర్ కుమార్‌కు ఎంతో ఇష్టమైన హిందీ ఓల్డ్ మెలోడీస్‌ని ఎవరో వేణువు మీద పలికిస్తున్నారు. కిశోర్‌కుమార్‌కి కొన్నాళ్లు ఆ ఇంట్రెస్టూ వుండేది. మొదట్లో బుల్ బుల్. మధ్యలో గిటార్. చివర్లా ఫ్లూట్... ఓ స్థాయికి చేరుకుంటున్న దశలో సంగీతానికి చదువు అడ్డు పడింది. డిగ్రీ.... సివిల్స్ ప్రిపరేషన్.. ఐఆర్‌టిఎస్‌లో సెలెక్షన్... రైల్వే ఆపరేటింగ్ శాఖలో ఉద్యోగం!

సంగీతం చెట్టెక్కింది. సర్దుకుపోవడం తనవంతయింది.

కిశోర్ కుమార్ మళ్లీ గదిలోకి వచ్చాడు. అక్కణ్నించి ముందు వైపు వరండాలోంచి మెట్లు దిగి, ప్లాట్‌ఫారమ్మీంచి నడిచాడు. పార్సిల్ ఆఫీసు గేటులోంచి రోడ్డు మీదకు చేరుకొని, చిమ్మ చీకట్లో మర్రి చెట్టు దిశగా కదిలాడు. రాళ్ల పొయ్యి కింద మంట కనిపిస్తోంది.

రెస్ట్ హౌస్ మెట్లు దిగి కిశోర్ బయటకి వెళుతుంటే వరండాలో పడుకొన్న ఆయన పర్సనల్ అటెండర్ బసప్పకి మెలకువ వచ్చింది. మాతృభాసలో కంగారు పడ్డాడు.

''ఇదేన్నీ దొడ్డ సాయిబుకు కత్తలల్లి హోగుత్తాయిద్దారె?'' అనుకుంటూ చీకట్లో కిశోర్‌కుమార్‌ని అనుసరించబోయాడు. కానీ దొరగారి స్వభావం గుర్తొచ్చి వెనక్కి తగ్గాడు. ఆఫీసు పనిలో తప్ప ఏకాంత సమయంలో అటెండర్ తన వెంట రాకూడదు. అది దొరగారికి నచ్చదు. అయినా ఉత్సుకత కొద్దీ దూరం నుంచి కిశోర్‌కుమార్‌ని చూశాడు బసప్ప! ఆయన మర్రిచెట్టు వైపు వెళుతున్నారని అర్థమైంది. కాసేపటి తరువాత దొరగారు తిరిగి రాగానే బసప్ప లేచాడు. ప్లాట్‌ఫారమ్మీద డిప్యూటీ స్టేషన్ సూపరిండెంట్ ఆఫీసుకి వెళ్లి తిరిగొచ్చాడు. అలా తిరిగొచ్చిన పదినిమిషాల్లో..

మర్రిచెట్టు కింద మువ్వలు మూగబోయాయి. ఫ్లూటూ, డోలక్కూ ఆగిపోయాయి. కేకలు... అదిలింపులు.. ఆర్తనాదాలు... గందరగోళం.

ఆఫీసర్ కిశోర్‌కుమార్‌కి అర్థం కాలేదు. వీధి వరండాలోకి వచ్చి ''బసప్పా'' అని అరిచాడు.

''సార్'' అంటూ బసప్ప చేతులు కట్టుకొన్నాడు.

''ఏవిటా గోల?'' అని దొరగారు అడిగేలోగా తను చేసిన నిర్వాకం చెప్పాడు.

మర్రిచెట్టు కింద ముసాఫిర్లు గానాబజానా పెట్టి దొరగారిని నిద్రపోనివ్వడం లేదనీ, ఆయన స్వయంగా వెళ్లి చెప్పినా వాళ్ల గోల ఆగలేదనీ, ఆర్‌పీఎఫ్ వాళ్లకి బసప్ప ఫిర్యాదు చేశాట్ట. జవాన్లు లాఠీలు ఊపుతూ వెళ్లారు. తట్టాబుట్టా ఎగిరి పడ్డాయేమో ముసాఫిర్లు గగ్గోలు పెడుతున్నారు.

''అలాగని నీకెవరు చెప్పారు? అన్నీ ఊహించుకోవడమేనా?'' కిశోర్ కుమార్ బసప్పని మందలించాడు. అసహాయుల మీద దాడిని వెంటనే ఆపమంటూ ఆదేశాలు పంపించాడు.

''ఇదేనప్పా పరమశివనే....'' అంటూ బసప్ప పరుగుదీశాడు. కాసేపట్లో ఆర్తనాదాలు ఆగిపోయాయి.

మువ్వలూ,... మురళీ... డోలక్... హిందీ ఓల్డ్ మెలోడీస్‌ని అందుకొన్నాయి. వాటిని ఆస్వాదిస్తూ కిశోర్‌కుమార్ కొంత సేపటి క్రితం మర్రిచెట్టు కింది ముసాఫిర్ల నుంచి చాటుగా తీసుకొచ్చిన జొన్న రొట్టెల పొట్లాన్ని విప్పాడు. మనస్ఫూర్తిగా ఆఘ్రాణించి, ఒక్కోముక్కనీ ఆప్యాయంగా రుచి చూశాడు. అలా రుచి చూస్తూ, చెట్టు కింద ఫ్లూట్లు తయారు చేసే వ్యక్తి నుంచి తీసుకొచ్చిన మురళిని బ్రీఫ్‌కేస్‌లో భద్రపరిచాడు.

అదే సమయంలో.....

''భగవాన్ ఆప్ కా భలా కరేగా'' మర్రి చెట్టు కింది ముసాఫిర్లు ఉబ్బితబ్బిబ్బు అవుతున్నారు. కిశోర్ కుమార్ వాళ్లకొచ్చిన నోట్ల కట్టను అప్పటికి ఎన్ని సార్లు లెక్క పెట్టేరో లెక్కేలేదు.

*



## 'ఎంతిరమ్'గా పేరు మార్చుకున్న 'రోబో'

రజనీ కాంత్ హీరోగా స్టార్ దర్శకుడు శంకర్ నిర్మిస్తున్న చిత్రం పేరు తమిళంలో మారింది. నిన్న మొన్నటివరకూ 'రోబోట్'గా చెలామణీ అయిన ఈ చిత్రం పేరు ఇప్పుడు 'ఎంతిరమ్' (యంత్రం). తమిళంలో పేర్లు పెట్టుకున్న చిత్రాలకే టాక్స్ రిబేటు ఇస్తామని అక్కడి ప్రభుత్వం ప్రకటించడంతో ఈ మార్పు చేసారట. 'శివాజీ' తరువాత రజనీకాంత్, శంకర్ కాంబినేషన్‌లో వస్తున్న రెండో చిత్రం ఇది. ఐశ్వర్యారాయ్‌తో మాత్రం రజనీకాంత్‌కు ఇదే తొలి చిత్రం. త్వరలో దక్షిణాఫ్రికాలో ప్రారంభం కానున్న తొలి విడత షూటింగ్‌లో ఆమె పాల్గొంటుంది. ఈ చిత్రం ప్రారంభ పూజను ఇటీవల వినాయక చవితి రోజున ఎలాంటి ప్రచారం లేకుండా రహస్యంగా జరిపారు. తన గత చిత్రం 'కథానాయకుడు' మంచి చిత్రం అయినప్పటికీ అధిక ప్రచారం వల్ల పెరిగిన అంచనాలను అందుకోలేక పరాజయం పాలయిందని రజనీకాంత్ అభిప్రాయం. అందుకే ఈ చిత్రాన్ని అంచనాల నుండి దూరంగా ఉంచడానికి ప్రారంభోత్సవాన్ని ఏ ప్రచారార్భాటమూ లేకుండా రహస్యంగా జరిపారట.